హైదరాబాద్ వార్త



# హస్త కళలను ప్రోత్సహించటమే ప్రధాన లక్ష్యం

## చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముషీరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** కనుమరుగవుతున్న హస్తకళలను ప్రోత్సహించటమే ప్రధాన లక్ష్యంగా గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్స్ మరియు టెక్స్‌టైల్స్ మేళాను ఏర్పాటుచేయటం జరిగిందని తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ, జాతీయ బ్యాంకు నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్ మేళాను ఆయన తెలంగాణ హస్తకళల అభివృద్ధిసంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రభుత్వ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజారామయ్యర్, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయభాస్కర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హస్తకళాకారులను ప్రోత్సహించి, వారి కళలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుండి మార్చి 9 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో చేనేత వస్త్రాలు, డోక్రా కళారూపాలు, చెరియాల్ పెయింటింగ్స్, బిద్రి, నిర్మల్ పెయింటింగ్స్, వెదురు, ఇత్తడి కళారూపాలు, జ్యూట్ వస్తువులు, ముత్యాలు, ఇమిటేషన్ జ్యూవెలరీ తదితర అనేక కళా రూపాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా 11 మంది కళాకారులను స్టేట్ అవార్డులకు ఎంపికచేసి బహుమతులు అందచేశారు. మొదటి బహుమతిగా రుక్యాబాయ్ అనే మహిళకు 50 వేల నగదు బహుమతి ఇచ్చి శాలువాతో సత్కరించారు. రెండవ బహుమతిగా 40 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 35 వేల రూపాయలు, నాలుగవ బహుమతి నుండి 11 వరకు 20 వేల రూపాయల నగదు బహుమతులు అందచేశారు.

# పేరుకే ఫ్రీక్వెన్సీ !



## రద్దీ వేళల్లో మెట్రో ప్రయాణికులకు తప్పని నిరీక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త**

"మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడటానికి చోటు ఉండటం లేదు. కదలడానికి..మెదలడానికి అవకాశం ఉండటం లేదు..మెట్రో కోచ్‌లు పెంచండి..3 కోచ్‌లు ఉన్న మెట్రో రైలును 6 కోచ్‌ల వరకు పెంచండి" ఇదీ గత కొన్ని నెలలుగా మెట్రో ప్రయాణికులు చేస్తున్న డిమాండ్ ఇది. నగరంలో రద్దీ వేళల్లో మెట్రో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రతి నాలుగైదు నిమిషాలకోసారి మెట్రో రైలు నడుపుతామన్న అధికారుల మాటలకు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నిసందర్భాల్లో 8 నుంచి 10 నిమిషాల పాటు నిరీక్షణ తప్పడం లేదని చెబుతున్నారు. కొన్ని సార్లు ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం మూడు మెట్రో కారిడార్ల పరిధిలోని 54మెట్రో స్టేషన్లకు చేరుతున్న ప్రయాణికులు ఫ్లాట్‌ఫారాలపై కిక్కిరిసిపోతున్నారు. రైలులోకి ప్రవేశించే సమయంలోనూ తోపులాట తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక బోగీల్లోనూ బయటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏసీని పెంచడం లేదా తగ్గించడం చేస్తున్నట్లు అధికారులకు చెబుతున్నారు. కానీ.. మధ్యాహ్నం వేళల్లో బోగీల్లో ఉక్కపోతతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు విలవిల్లాడుతున్నారు. మెట్రో రైల్లో ప్రయాణికుల రద్దీ అనుగుణంగా కోచ్‌లను పెంచడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కోచ్‌లతో నడుస్తున్న మెట్రో రైల్లకు ఆరు కోచ్‌ల వరకు ఏర్పాటు చేసి రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మెట్రో అధికారుల పర్యవేక్షణ లోపంతోనే తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు.

**పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య..**

నగరంలో మెట్రో రైళ్లలో రద్దీ క్రమంగా పెరుగుతోందని మెట్రో వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సాధారణ రోజుల్లో మూడు కారిడార్లతో కలిసి రద్దీ 4.5 నుంచి 5లక్షలుకాగా.. సెలవురోజుల్లో రద్దీ 5.5 లక్షలకుపైగా చేరవవుతోందని పేర్కొన్నాయి. సాధారణ రోజుల్లో అత్యధికంగా ఎల్బీనగర్ - మియాపూర్ నిత్యం సరాసరిన సుమారు 2.75 లక్షల మంది జర్నీ చేస్తున్నారని.. ఆతర్వాత నాగోల్ - రాయదుర్గం మార్గంలో 2.5లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని.. ఇక జేబీఎస్ - ఎంజీబీఎస్ రూట్‌లలో రద్దీ.... వేలుగా ఉంటుందని తెలిపాయి. నగరంలో అన్ని మెట్రో స్టేషన్ల వద్ద ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్ చేసుకునే అవకాశం లేకపోవడం, పార్కింగ్ ఉన్న చోట చార్జీల బాదుడు షరామామూలే. సమీప కాలనీలు, బస్తీలకు చేరుకునేందుకు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు. ఇటీవలి కాలంలో పలు మెట్రో స్టేషన్లలో మధ్యభాగం (కాన్‌కోర్స్) వద్ద చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్మాణ సంస్థ అవకాశం ఇచ్చింది. ఈ ప్రాంతంలో నిత్యావసరాల దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీంతో రైలు దిగిన వెంటనే సిటిజన్లు వస్తువులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

**రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలి: సిపిఎం**

మెట్రో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కోచ్‌లను పెంచాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఆపార్టీ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇప్పటికే మెట్రో భవన్ వద్ద ధర్నా నిర్వహించి, మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డికి వినతిపత్రం కూడా ఇచ్చారు. రద్దీకి అనుగుణంగా మూడు కోచ్‌లు ఉన్న మెట్రో రైలును ఆరు కోచ్‌ల వరకు పెంచాలని నగర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రయాణికుల అవసరాలను, ఇబ్బందులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు.

# చెరువులకు జీవకళ..

- పునరద్ధురణపై హైడ్రా ఫోకస్
- ముమ్మరంగా సాగుతున్న సుందరీకరణ
- మొదటిదశలో 6చెరువుల్లో పనులు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ రంగనాథ్
- జూన్‌నాటికి పనులను పూర్తయ్యేలా చర్యలు



ఉప్పల్ నల్లచెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్, హైడ్రా అధికారి బాచిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులను హైడ్రా వేగవంతం చేసింది. ఈ మేరకు శుక్రవారం లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు సంబంధించి విమోస్ టెక్నోక్రాట్స్ రూపొందించిన డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు), కాన్సెప్ట్‌లను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. మొదటివిడతగా చేపట్టిన 6 చెరువులలో సున్నంచెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, భుమ్రుఖ్ ఉద్దీన్‌దౌలా చెరువులను కమిషనర్ సందర్శించారు. స్థానికులతో మాట్లాడి చెరువుల పునరుద్ధరణ పనులకు సహకరించాలని కోరారు. సుందరీకరణ పనులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, ఈ బాధ్యతను హైడ్రాకు అప్పగించిందన్నారు. స్థానికుల నుంచి మంచి సహకారం అందడం ఆనందించదగ్గ విషయమని త్వరలో చెరువుల్లో జీవకళను అందరూ చూస్తారన్నారు. అలాగే బఫర్ జోన్లలో ఇంటి స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం టీడీఆర్ కింద సహాయం అందిస్తుందని ఇప్పటికే నివాసాలున్న ఇళ్లను కూల్చబోమని ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. సుందరీకరణ పనుల్లో ఎక్కడా నివాసాలను తొలగించమని పునరుద్ధరణతో మీ ప్రాంతాలన్నీ ప్రాధాన్యతను సంతరించుకుంటాయని కమిషనర్ పేర్కొన్నారు.

**డీవాటరింగ్ పనులపై దృష్టి..**

దాదాపు రూ.58.50 కోట్లతో సున్నంచెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని భమ్రుఖ్ ఉద్దీన్ దౌలాచెరువు, బతుకమ్మకుంట చెరువులను మొదటి విడతగా హైడ్రా అభివృద్ధి చేస్తున్న విషయం విధితమే. అయితే ప్రస్తుతం యీ చెరువులలో డీ వాటరింగ్ పనులను హైడ్రా చేపట్టింది. ముందుగా చెరువుల్లో వున్న వ్యర్థ జలాలను బయటకు పంపి డ్రై చేస్తున్నారు. వచ్చే జూన్ నాటికి ఈ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో హైడ్రా ముందుకెళ్తోంది.

**మురుగు నీరు శుద్ధి ..వాకింగ్ ట్రాక్**

హైదరాబాద్‌లోని చెరువులకు మహర్దశ పట్టనుంది. సహజ పద్ధతుల్లోనే మురుగుతో నిండిన చెరువులను తాగునీటి జలవనరులుగా తీర్చిదిద్దేందుకు హైడ్రా పనులు మొదలుపెట్టింది. బెంగళూరులో కలుషిత నీటితో కాలుష్య కాసారంలా మారిన చెరువులు ఆక్రమణలతో కనుమరుగైన చెరువులకు అక్కడి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మంచినీటి జలవనరులుగా మార్చేందుకు నిత్యం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఆనంగద్ మల్లిగవాడ్ అనే వ్యక్తి తన ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలేసి చెరువులను కాపాడటమే లక్ష్యంగా 2017 నుంచి 35 చెరువులకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. అలాంటి పరిస్థితిని తీసుకువచ్చేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుంది. చెరువులవద్ద కోట్ల రూపాయలు వెచ్చించి మురుగు శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం, చుట్టూ వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి రూ.కోట్లలో వెచ్చిస్తున్నారు. దుర్గం చెరువు అభివృద్ధికి ఓ కార్పొరేట్ సంస్థతో రూ.60కోట్లకుపైగా జీహెచ్ఎంసీ ఖర్చు చేయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బెంగళూరులో నామమాత్రపు ఖర్చుతో జలవనరులు మెరుగుపడుతుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది. చెరువులకు వరద నీటితోపాటు, మురుగునీటి నాలాలు ఉంటాయి. విస్తీర్ణం ఆధారంగా ఆయా చెరువులను ఆనంద్ పూర్తిగా తవ్వేవారు. పూడిక తొలగిస్తారు, క్రమపద్ధతిలో చెరువు అడుగు భాగాన్ని చదును చేస్తారు, చుట్టూ కట్టనిర్మించడం మొదటి దశలో చేస్తారు. కట్ట నిర్మాణం పూర్తయ్యాక చెరువు మధ్యలో మరోకట్ట నిర్మించి ఓ వైపున వరద నీరు, మరోవైపు మురుగునీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేస్తారు. చెరువులోకి మురుగు వ్యర్థాలను తీసుకొచ్చే అన్ని పైపులైన్లను ఓ ప్రాంతంలో లింక్ చేస్తారు. ఆ ప్రాంతం తటాకం కంటే ఎత్తులో ఉంటుంది. ఆ క్రమంలో మరో మూడు వడపోత కుంటలను ఏర్పాటు చేస్తారు. మొదటి కుంటలో చెట్లు, రెండో కుంటలో పెద్ద రాళ్లు ఉంచుతారు, మూడో కుంటలో కంకర, ఇసుక మిశ్రమాన్ని భారీగా పోస్తారు. దీంతో మురుగు నీరు చెట్ల మధ్య నుంచి ప్రవహిస్తూ రాళ్లు, కంకర, ఇసుక, వేర్వేరు మొక్కలను దాటుకుంటూ వెళ్లిన నీరు పరిశుభ్రంగా మారుతుంది.

# ఆత్మ సేవలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటా

## -తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి



ఎం.కోదండరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న కృష్ణనాయక్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ(ఆత్మ) సేవలను వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ(ఆత్మ) అసోసియేషన్ సభ్యులు ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అత్మద్వారా గతంలో రైతులకు క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు, విజ్ఞాన యాత్రలు ఏర్పాటు చేసి పంట దిగుబడి పెరిగేవిధంగా కార్యక్రమాలు జరిగి రైతాంగానికి ఎంతో ఉపయోగపడేవని, కాని. గత కొన్ని సంవత్సరాలుగా ఆత్మ ద్వారా ఎలాంటి వ్యవసాయ కార్యక్రమాలు చేపట్టకపోవడం వలన వ్యవసాయ ఖర్చులు పెరిగి దిగుబడులు తగుతున్నాయని ఛైర్మన్ దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ(ఆత్మ)కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ప్రతినిధులు కోరారు. వెంటనే స్పందించిన కోదండ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమీషన్ సభులు భవాని, భూమి సునీల్ కుమార్‌తో పాటు అన్నీ జిల్లాల అభ్యుదయ రైతులు వంగాల వెంకట్ రెడ్డి, హుజురాబాద్, కె.శ్రీనివాస్‌రావు(మిర్యాలగూడ), ఆత్మ డివిజన్ ఛైర్మన్, రైతులు ఎస్‌కె.భాషా, కొర్ర శక్రునాయక్, ఎ.మధు నాయక్, రామారావు, ఆత్మ యూనియన్ ప్రెసిడెంట్ ఎ.కృష్ణనాయక్, ఉపాధ్యక్షుడు చరణ్, సంయుక్త కార్యదర్శి సురేందర్‌రెడ్డి, రవీందర్, మౌనిక, శ్రీవిద్య, అర్చన, షీలా తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాషను మరవద్దు : గవర్నర్




ఆంధ్రసరస్వతి బాలిక ఉన్నత పాఠశాల ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**గోషామహల్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త:** ప్రతిఒకరూ తల్లితో సమానమైన మాతృభాషను మరవ కూడదని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అన్నారు. శుక్రవారం బేగంబజార్ ఫీల్‌ఖానాలోని ఉన్న ఆంధ్రసర్వసతి బాలిక ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో బిజెపి పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిహెచ్ఎంసి ఫ్లోర్‌లీడర్ గొంటి శంకర్‌యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర సర్వసతి బాలికల ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు కొండా వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు విద్య ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధిస్తారని అన్నారు. బాలికలకు చదువుతో పాటు, క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని కోరారు. ఎంతో దూరదృష్టితో వందేళ్ల క్రితం బాలికలకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ పాఠశాలను ప్రారం భించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యబోదలను చేసిన ఉపాధ్యా యులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి కోసం సహకారాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. సహకారాన్ని అందించిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కన్యావిద్యాసమితి అధ్యక్షుడు గుబ్బ నాగేంద్రరావు, సెక్రటరీ ధన్‌రాజ్ సోని, కోశాధికారి బి.హన్‌మంత్‌రావు, ఉపాధ్యక్షులు రాంచంద్రారెడ్డి, కమిటి సభ్యురాలు అరుణ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, రాఖీ, అరుంధతి, అంజనాదేవి, సుగణలతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు. కాగా అనంతరం విద్యార్దులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యంను తిలకించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ప్రారంభమైన విజ్ఞాన్ వైభవ్-2025

## ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న క్షిపణులు, రాకెట్ లాంఛర్లు, యుద్ధ ట్యాంక్‌లు.. తరలివచ్చిన యువతతో కిక్కిరిసిన గచ్చిబౌలి స్టేడియం




అర్జున్ యుద్ధ ట్యాంకు




రుద్రం మిస్సైల్



తిలకించేందుకు తరలివచ్చిన యువతతో కిక్కిరిసిన గచ్చిబౌలి స్టేడియం

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతను సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలోని జీఎంసి బాలయోగి స్టేడియంలో భారత ఆయుధశక్తి, సామర్థ్యాలను తెలియజేసే విజ్ఞాన్ వైభవ్-2025 ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం ప్రారంభించిన ఈ ప్రదర్శన శని, ఆదివారాలు రెండు రోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండనుంది. ఈ సందర్భంగా శుక్రవారం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రదర్శనను తిలకించే అవకాశం కల్పించగా, నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలివచ్చారు. శని, ఆదివారాలలో ఈ ప్రదర్శనను తిలకించవచ్చని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనకు మూడు రోజుల్లో మొత్తం 20 వేల మంది వస్తారని నిర్వాహకులు అంచనా వేయగా, మొదటి రోజే 10 వేలమంది వరకు హాజరుకావడంతో స్టేడియంలో యువోత్సాహంతో మారుమ్రోగింది.

**ప్రదర్శనలో త్రివిధ దళాల ఆయుధ సామాగ్రి...**

నగరంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో భారత త్రివిధ దళాలు ఉపయోగించే అత్యాధునిక ఆయుధ సామాగ్రిని ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 220 స్టాళ్లను ఏర్పాటుచేసి రక్షణ రంగ ఉత్పత్తులు, టెక్నాలజీలను, ఆయుధాలు, విడిభాగాలను, ఎయిర్‌ఫోర్స్ టెక్నాలజీ, ఫ్లయింగ్ క్లాత్స్ ప్రదర్శనకు ఉంచారు. రక్షణ పరికరాలు, ఆయుధాలను తయారుచేసే డిఆర్‌డివోల్, డిఆర్‌డిఓ, ఇస్రో, మిథాని, బీడిఎల్, బిఈఎల్, ఈసిఐఎల్‌లు రూపొందించిన స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆయుధ సంపత్తి వివరాలను ప్రదర్శనలో శాస్త్రవేత్తలు సామాన్య లకు వివరిస్తున్నారు.

- మన రక్షణ రంగ పాటవాన్ని చాటిచెప్పే అగ్ని, బ్రహ్మోస్, ఆకాష్, ప్రళయ్ బాలిస్టిక్ క్షిపణులు ప్రదర్శనకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి
- రక్షణశాఖ అమ్ములపొదిలో త్వరలో చేరనున్న మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ ఎంపిఏటిజిఎం మిస్సైల్స్‌ను ప్రదర్శలో ఉంచారు.
- రిమోట్‌తో పనిచేసే పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే, బరువైన వస్తువులను తరలించేందుకు ఉపయోగించే దక్ష్ డిఫ్యూజర్‌ను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన గాలిలో నుంచి భూమి మీదకు ప్రయోగించే రు ద్రం మిస్సైల్ కనువిందు చేస్తుంది.
- ఫైరింగ్ రేంజ్‌లో వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న ఆర్టిలరీ గన్ సిస్టం ఏటిఏజిఎస్‌ను ప్రదర్శనలో ఉంచారు.
- భూమి మీద నుంచి శత్రువుల హెలికాప్టర్లు, ఎయిర్ క్రాఫ్ట్‌లు, యుఏవిలను కూల్చివేసే క్యూఆర్ ఎస్ఏఎం మిస్సైల్స్ ఏర్పాటు చేశారు.
- డిఆర్‌డిఓ అభివ ృద్ధి చేసిన వీల్ యుద్ధ ట్యాంక్‌లు, అర్జున్ యుద్ధ ట్యాంక్‌లు ప్రదర్శనలో ఆకట్టుకుంటున్నాయి.
- డిఆర్‌డిఓ యువ శాస్త్రవేత్తలు రూపొందించిన అత్యాధునిక డ్రోన్‌తో ఫైరింగ్ చేసే 'గన్ ఆన్ డ్రోన్' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

### ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో

# తెలంగాణ జైళ్ల శాఖది మొదటి స్థానం



ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అందజేస్తున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వి.వి.శ్రీనివాసరావు

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో తెలంగాణ జైళ్ల శాఖ దేశంలోనే ముందుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వి.వి.శ్రీనివాసరావు అన్నారు. సికాలో శుక్రవారం జరిగిన జైళ్ల శాఖ సిబ్బందికి ఆధునిక ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదిజగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూడిషియల్, జైళ్లశాఖ, పోలీసు, ఫోరెన్సిక్ శాఖలు సమన్వయంతో పని చేయడం ద్వారా నేరాలను అదుపు చేయడంతో పాటు వాటిని నివారించడానికి దోహద పడుతుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరి జ్ఞానంతో జైళ్లశాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ జైళ్ల శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగం గానే రాష్ట్రంలోని అన్ని జైళ్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి వై.రాజేష్, డిఐజిలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్, జైళ్ల శాఖ అధికారులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఎసిపి శంకరరాజును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ట్రాఫిక్ ఎసిపిని సత్కరించిన కాంగ్రెస్ నేతలు

**బేగంపేట ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** బేగంపేట అల్లంతోటబాయి ప్రధాన రహదారిలో కొన్ని దశాబ్దాల నుంచి రోడ్డు మధ్యలో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న భారీ వృక్షాన్ని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు ఇటీవల తొలగించి సమీపంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో నాటి ఆ వృక్షానికి జీవం పోశారు. ఈ సందర్బంగా అల్లంతోట బాయిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయాయని, చెట్టును తొలగించిన ట్రాఫిక్ ఏసీపీని కాంగ్రెస్ నాయకులు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో పలువురు నేతలు శుక్రవారం శంకరరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.పద్మారెడ్డి, ఎం. సాంబయ్య, ఎస్,మహేష్, ఎం.శాంతి, బి.పెద్దబాబు, జి.బిట్లు, ఎం.చిన్నా, రాజయ్య, బాలరాజు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా ప్రసాదరావు

**బేగంపేట ఫిబ్రవరి 28,ప్రభాతవార్త :** బేగంపేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన చిర్ర రామయ్యను రాష్ట్ర సచివాలయం సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ ఉత్వర్వులు జారీ చేసారు. ఆయన స్థానంలో 2007 బ్యాచ్‌కు చెందిన బి.ప్రసాదరావును స్పెషల్ బ్రాంచ్ నుంచి బేగంపేటకు బదిలీ చేసారు. ప్రసాదరావు నగరంలోని అబిడ్స్, బంజారాహిల్స్ ట్రాఫిక్ విభాగాల్లో పనిచేసారు.

**శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యం : ఇన్‌స్పెక్టర్**

బేగంపేట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.ప్రసాదరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. అలాగే కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్ నిర్మూలనకు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌పై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. అల్లర్లకు పాల్పడే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ప్రసాదరావు హెచ్చరించారు. కేసుల తక్షణ పరిష్కారానికి ఇరువర్గాలతో చర్చించి శాంతి యుతంగా పరిష్కరించుకునేందుకు కృషి చేస్తానన్నారు. మద్యం దుకాణాలు, హోటల్స్ సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంటుందని,ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## 2న మహిళా శక్తి మహాకుంభ్, మహిళా దినోత్సవ వేడకలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జస్మత్‌పటేల్

**సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన సికింద్రాబాద్‌లోని గుజరాతీ పాఠశాలలో మహిళా శక్తి మహాకుంభ్, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఛైర్మన్ జస్మత్‌పటేల్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా గో సేవ, సనాతన సేవ, ఆరోగ్య సేవ, తదితర రంగాలలో సేవలు అందిస్తున్న వారికి గోరత్న, మహిళారత్న, వైద్యరత్న, సమాజ రత్న పేరిట అవార్డులను ప్రదానం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన బ్రోచర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు తమ,తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ఉచితంగా స్థలాలు ఏర్పాటుచేస్తున్నామని, ఇందులో పాల్గొనే మహిళలకు లక్కీ డ్రా ద్వారా 100 వెండి నాణేలు బహూకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపి డా. కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే జి.వివేక్, సినీ నటుడు సుమన్, మిస్ ఇండియా-24 సుధాజైన్ తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఆర్.కె.జైన్, రిదేష్ జాగిర్ధార్, జైన్‌రత్న మీనా పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేదు లేదు



మహేంద్రహిల్స్‌లో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న ఇంజనీర్లు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజనీర్ సిహెచ్.ఉమాశంకర్ హెచ్చరించారు.బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు శుక్రవారం మహేంద్రహిల్స్‌లోని త్రిమూర్తి కాలనీ రోడ్డు నెం -9 ప్లాట్ నెం -94, బాలంరాయి సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. బాలంరాయి సొసైటీ ప్లాట్ నెం -54కు సెల్లార్ గ్రౌండ్‌కు అనుమతి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వేసిన 2 ఫ్లోర్లను సీజ్ చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఇంజనీర్లు దినేశ్, తరుణ్ రెడ్డి, జిష్ణు,విష్ణుసాగర్,రాజేందర్‌లు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ కళాశాలలో ఘనంగా నవరంగ్ వేడుకలు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రి,పిజీ కళాశాలలో శుక్రవారం నవరంగ్ వార్షిక ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను కళాశాల చైర్మన్ నరోత్తమ్‌రెడ్డి, కార్యదర్శి ఫహీముద్దీన్, కోశాధికారి సురేశ్, కళాశాల ప్రినిసపాల్ డాక్టర్ ఆర్.రాజశ్రీలు పాల్గొన్నారు. నగరంలోని వివిధ డిగ్రీ కళాశాల విద్యార్థులు నవరంగ్ పాల్గొని పలువురిని అలరించే విధంగా, సాంస్కృతిక, నృత్య,సంగీత పోటీలు నిర్వహించారు. వివిధ రంగాలో ప్రతిభకనబర్చిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

## శాస్త్రినగర్‌లో రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని శాస్త్రి నగర్ ప్రధాన రోడ్డు మార్గంలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాని శ్రీనివాస్, ఎండి.ఇస్మాయిల్, రామప్ప, రాజు,మల్లేశ్, శ్రీశైలం, బిక్షపతి, కుమార్‌లు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్న శ్రీనివాస్

# అమరవీరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ

### వంగపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

**సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటాన్ని 30 ఏళ్లపాటు సజీవంగా నిలిపింది త్యాగాలు చేసిన కార్యకర్తలేనని, వారి త్యాగాల పునాదుల మీద ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ భోగాలు అనుభవిస్తున్నారని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. వర్గీకరణ ఫలితం అందుకునేవరకు చేరుకున్నామంటే ఆది అమరవీరుల ఫలితమేనని, అందుకే ఈ వర్గీకరణ విజయాన్ని అంకితం చేయాలని తాము నిర్ణయించామన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో ఏనాడు కృష్ణ మాదిగ అమరవీరుల కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదని, అగ్రకుల నేతల ఇండ్లలో పెళ్లిళ్లకు, చావులకు పోయే సమయం ఉంది కాని, తన వెంట పనిచేసిన కార్యకర్తల ఇండ్లకు పోయే సమయం ఆయనకు దొరకలేదని విమర్శించారు. తొలుత తాము ఈ విజయాన్ని అమరవీరులకు అంకితం చేశామని, అమరుల కుటుంబాలను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంతో ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు చెక్కులను అందించిందని వంగపల్లి గుర్తు చేశారు. మార్చి 1వ తేదీ శనివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని జిల్లాల్లో నివాళులర్పిస్తున్నామని, మార్చి 19న రాజకీయాలకు అతీతంగా 'మాదిగ అమరవీరుల సంస్మరణ సభ' నిర్వహిస్తున్నామని,సభకు అన్ని రాజకీయ పార్టీ నేతలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రమేష్, చాప కృష్ణ, యాదగిరి, కొల్లూరి వెంకటేష్, శాంతికిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

## హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలి : కార్పొరేటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శుక్రవారం ఎస్సీ ఎస్టీ పౌరహక్కుల దినోత్సవం సందర్బంగా గోల్నాక డివిజన్ కృష్ణనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు.ఈ సందర్బంగా ఎస్సీ ఎస్టీ పౌరహక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ నరేష్, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు 'సనాతన ధర్మము' గ్రంథావిష్కరణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** యువకళావాహిని ఆధ్వర్యంలో రాచకొండ మల్లికార్జునరావు రచించిన 'సనాతన ధర్మము' గ్రంథావిష్కరణ కార్యక్రమం శనివారం డాక్టర్ కె.వి.రమణాచారి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్షుడు 'కళావాచస్పతి' లంక లక్ష్మీనారాయణ వివరించారు. డాక్టర్ అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, 'సాంస్కృతికబంధు' సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ప్రభుత్వ పూర్వసలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి ప్వాతీశం, విశ్రాంత ఉపధ్యాయిని శ్రీధర ప్రభావతి, సినీ రచయిత డాక్టర్ పి.రాజేంద్రకుమార్, జివిఆర్ కల్చరల్ ఫౌండేసన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి పాల్గొంటారని, కార్యక్రమాన్ని పురస్కరించుకుని సుప్రియా చక్రవర్తి శిష్యబృందం నిర్వహణలో 'సంగీత కార్యక్రమం' ఉంటుందన్నారు.

## 4న ప్రసిద్ధ దర్శకుడు వంశీ సినీ జీవిత స్వర్ణోత్సవం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పలు హిట్ సినిమాలు సితార, అన్వేషణ,లేడీస్ టైలర్,ఆలాపన, వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన వంశీ సినీ జీవిత స్వర్ణోత్సవ వేడుక మార్చి నెల 4 వ తేదీన రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ ( ఇండియా) గాయని శారద (అమెరికా) సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ గాయనీ శారద అకునూరి పత్రికా విలేకరులకు తెలిపారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ పాల్గొని వంశీని సత్కరిస్తారని, అతిథులుగా రచయిత వేమూరి సత్యనారాయణ, సినీ ఆటోగ్రాఫర్‌లు ఏం వి రఘు, హరి అనుమోలు, నిర్మాత ఏడిద రాజా పాల్గొంటారు. సభా కార్యక్రమానికి తొలుత శారద నిర్వహణ లో వంశీ సినిమాల లోని సినీ గీతాల విభావరి వుంటుందని వారు చెప్పారు.

## తెలుగు వర్సిటీ గ్రంథ పాలకులు పదవీ విరమణ

**నిజాంపేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** నాలుగు దశాబ్దాలుగా తెలుగు విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ ప్రస్తుతం వర్సిటీ కేంద్ర గ్రంథాలయానికి ఇన్‌చార్జి లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న బి.వెంకట రమణారెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్బంగా వారికి రావలసిన ఆర్థిక లాభాలను వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలదండ నిత్యానందరావు అందజేసి విశ్వవిద్యాలయం పక్షాన శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ వెంకటరమణరెడ్డి విశ్వవిద్యాలయానికి అందించిన దీర్ఘకాల సేవలను వర్సిటీ గుర్తించుకుంటుందని అన్నారు. ఉద్యోగి పదవి విరమణ అనేది కేవలం ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే కాదు, కొత్త జీవనధ్యాయానికి ఆరంభం అని అన్నారు. ఇప్పటివరకు సంస్థకు సమయం కేటాయించిన రమణారెడ్డికి తమ వ్యక్తిగత అభిరుచులకు, కుటుంబానికి మరింత సమయం కేటాయించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, ఆర్థికాధికారి వెంకటేశ్వర్ రావు, రింగు రామ్మూర్తి, ఉద్యోగ సంఘ నాయకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న నిత్యానంద రావు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** అంబర్‌పేట నియోజకవర్గం శాసనసభ సభ్యుడు కాలేరు వెంకటేశ్ శుక్రవారం పరిసరాల పరిశుభ్రత తీరుపై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాడు. నియోజకవర్గంలోని అంబర్‌పేట, నల్లకుంట, బాగ్ అంబర్‌పేట, గోల్నాక, కాచిగూడ డివిజన్ల పరిధిలోని ప్రాంతాలలో దోమలబెడద ఎక్కువగా ఉందని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్బంగా ఎమ్మెల్యే వెంకటేష్ పేర్కొన్నారు. పరిసరాలు బాగున్నప్పుడే ప్రజల ఆరోగ్యాంగా ఉంటారని, ఆదిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి ఎండమాలజీ సిబ్బంది బస్తీలలో తిరిగి స్ప్రే చేయాలని ప్రజల్లో అవగాహన తీసుకురావాలని పరిసరాల ప్రాంతాలలో నీళ్లు నిలవకుండా వారికి అవగాహన కలిగిస్తూ ఎక్కడ నీళ్ళు నిల్వకుండా ప్రత్యేక ఏర్పాట్లతో ముందుకు సాగాలని వారికి సూచించాడు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నిజాంపేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** 33/11 కేవీ అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలుఫీడర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

**11కెవి ఆర్.ఆర్.హోమ్స్ ఫీడర్‌లో...**

నేడు(శనివారం) ఉదయం 10.30నుండి 11 గంటల వరకు 11కేవీ ఆర్ఆర్ హోమ్స్ ఫీడర్‌లోని కేజిఆర్, సాయివిల్లాస్, గ్రీన్ విల్లాస్, ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ హోమ్స్, భరత్‌నగర్ కాలనీలలో విద్యుత్ ఉండదు.

**11కెవి అమీన్‌పూర్ ఫీడర్‌లో..**

నేడు ఉదయం 10:30 గంటల నుండి 1:30 గంటల వరకు అమీన్‌పూర్ విలేజ్, సురక్ష అభిటేట్, ఎన్టీఆర్ కాలనీ, సాయిరాం నగర్ ఫేస్ 1, ఫేస్2, పిఎన్ఆర్ కాలనీ, సాయి అంబికా ఫేస్1, ఫేస్ 2, 2బిహెచ్‌కె, టైలర్ కాలనీలలో విద్యుత్ ఉండదు.

**11కెవి బంధంకొమ్ము ఫీడర్‌లో..**

నేడు ఉదయం 11:30 గంటల నుండి 2:30 గంటల వరకు 11కేవీ బంధంకొమ్ము ఫీడర్‌లో బంధం కొమ్ము విలేజ్, శ్రీదాం, గ్రీన్ విల్లాస్, సబ్ స్టేషన్ బ్యాక్ సైడ్, కృష్ణ బృందావని టీచర్స్ కాలనీ, మైత్రి వ్యాలీ, శుభం ఇన్ఫ్రా, మారుతి హిల్స్, హిల్ టాప్ హిల్స్‌లో విద్యుత్ ఉండదు.

**11కెవి ఓడిఎఫ్ ఫీడర్‌లో..**

నేడు ఉదయం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు 11కేవీ ఓడిఎఫ్ ఫీడర్‌లో ఓడిఎఫ్ కాలనీ ఫేస్1, ఫేస్ 2, పెట్రోల్ బంక్ వెనుక, కేజిఆర్ చౌరస్తా, అవంతిక బ్యాక్ సైడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

## ఘనంగా జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం

**నిజాంపేట్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:** ప్రగతినగర్‌లోని వివిఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాలలోని భౌతిక, రసాయన శాస్త్ర విభాగాలు ఐఈఈఈ విద్యార్థి శాఖ, నానోటెక్నాలజీ కౌన్సిల్ హైదరాబాద్ సెక్షన్ చాప్టర్లతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఎస్ఐఆర్ఐఐసిటి సంస్థలో ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్. శ్రీధర్ పాల్గొని వికసిత్ భారత్ లక్ష్యసాధన కోసం శాస్త్రనవకల్పన రంగాల్లో భారత యువతను అంతర్జాతీయ నాయకత్వానికి సన్నద్ధులను చేయటమన్న అంశంపై ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయుడు ఆచార్య డా. సిడి నాయుడు మాట్లాడుతూ డా. శ్రీధర్ వంటి శాస్త్రవేత్తల రాకతో విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన వైపు శాస్త్రసాంకేతిక రంగాల వైపు దృష్టి సాధించగలరని ఆశాభావాన్ని వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు ఆచార్య డా.బి. చెన్నకేశవరావు, భౌతికశాస్త్ర విభాగాధిపతి డా. బి. అశోక్, రసాయనశాస్త్ర విభాగానికి నేతృత్వం వహిస్తున్న ఆచార్య డా. సి. జ్యోత్స్న, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త ఎమ్. సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. సి.వి. రామన్ 1928లో ఇదే తేదీన కనుగొన్న రామన్ ఎఫెక్ట్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్ డే సందర్భంగా కళాశాలలో క్విజ్, పోస్టర్ ప్రదర్శన, పరిశోధన పత్ర సమర్పణ, సాంకేతిక నమూనాల ప్రదర్శన వంటి విభాగాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను అందజేసారు.

# విద్యార్థుల మేదస్సు పెంపొందడానికి సదస్సులు దోహదం

### ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ మహ్మద్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఆధునీక విద్యారంగంలో బోధన పద్ధతులు, సాంకేతిక జోక్యం ద్వారా గుర్తింపబడ్డాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఎస్.కె.మహ్మద్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాషా బోధన సాంకేతిక, సాంప్రదాయాలు, ఆచారాలు, విలువలను సమగ్రపర్చడం అనే అంశాలపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల మేదస్సు పెంపొందడానికి ఇలాంటి సదస్సులు దోహదపడుతాయన్నారు. విద్యా రంగ వ్యాప్తికి ప్రభుత్వం ఎంతో సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ వి.రాజశేఖర్, కమిటీ సభ్యులు డాక్టర్ డి.ఎన్.రావ్, కె.హరి చంద్రప్రసాద్, సి.హెచ్.అచ్యుత రామ్‌ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ ఎన్.అరుణలు మాట్లాడుతూ చదువుతోనే మనిషి గొప్పవాడు కాగలుగుతాడన్నారు. విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు.



విజ్ఞాన జ్యోతి కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ మహ్మద్

ఇలాంటి సదస్సులతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రినిసపాల్ డాక్టర్ టీ.రమా, డైరెక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అలేఖ్య పుంజాల

## రేపు భక్త రామదాసు జయంతోత్సవాలు

**సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సుప్రసిద్ధి భక్తరామదాసు 392వ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు డా. అలేఖ్య పుంజాల తెలిపారు. మార్చి 2వ తేదీన ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్త రామదాసు జయంతి ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. శుక్రవారం కళాభవన్‌లో ఆమె ఉత్సవాలకు సంబంధిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఏడాది తమిళనాడు రాష్ట్రంలో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరిగా ఇకపై తెలంగాణలో ప్రతి ఏడాది భక్త రామదాసు జయంతి ఉత్సవాలు అధికారికంగా జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 26 సంగీత జ్ఞాన బృందాలు పేరును నామోదు చేసుకున్నాయని 600 మందికిపైగా సంగీత కళాకారులు పాల్గొంటారని ఆమె తెలిపారు. త్సవాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, అలాగే మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క, సాంస్కృతిక కార్యదర్శి స్మితసభరా్వల్ తదితరులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో బి.మనోహర్, ఆర్.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి : ఎమ్మెల్యే



రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో పూజలుచేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రజలపై ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఉంటే ఏదైనా సాధించగలుగుతామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం బొల్లారం శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, ఆలయ అధ్యక్షులు నరహరి, నాయకులు అరుణ్, రవిందర్ రెడ్డి, ప్రేమ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నం ప్రరబ్రహ్మ స్వరూపం : జంపన

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, పేదలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంప ప్రతాప్ అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయం, చిన్నతోకట్ట లోని కట్టమైసమ్మ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాశ్ భాటియా, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహా, రామారావు, అజిత్, శ్రీకాంత్, నరేందర్, జహింగీర్, చిన్నతోకట్ట ఆలయ కమిటీ సభ్యులు జాజుల క్రాంతి, సాయి, విఠల్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణరెడ్డి అన్నారు. సైన్స్ ఫేర్‌ను పురస్కరించుకొని శుక్రవారం పెన్షన్‌లైన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొని సైబర్ నేరాలపై పలు సూచనలు ఇచ్చారు. పోలీసులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత చదువులు చదువుకొని మంచి భవిష్యత్తు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్, డిఐ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 868 దరఖాస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

**బేగంపేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 868 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖకు సంబంధించి 87 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 58, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇళ్ల కోసం 636 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 64దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు.ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జిల్లెల చిన్నారెడ్డి దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలు తెల్సుకున్నారు.వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

## ఆనందోత్సహాల మధ్య ఫేర్‌వెల్ వేడుకలు

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** మెహిదీపట్నం సెయింట్ ఆన్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫేర్వెల్‌డే వేడుకలు విద్యార్థుల ఆనందోత్సహాల నడుమ ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రిన్సిపల్ సిస్టర్ ఏ.విజయరాణి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం అందరిని భావోద్వేగానికి గురిచేసింది. అనంతరం వెస్ట్రన్, క్లాసిక్ నృత్యాలు, హాస్యభరితమైన నాటికలు వేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. సాంప్రదాయ దుస్తువుల్లో రాంప్ వాక్ నిర్వహించడంతో ఫేర్వెల్ డే వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఏ.విజయరాణి చేతుల మీదుగా బహుమతులను, పురస్కారాలను అందజేశారు. 2024 2025 సంవత్సరానికి గాను ర్యాంప్ వాక్ లో మిస్ అన్నెట్ మరియు రన్నర్ అప్ లను ప్రకటించారు.మిస్ అన్నెట్‌గా రాబియా అంజద్, ఫస్ట్ రన్నర్ అప్‌గా అదీబా, సెకండ్ రన్నర్ అప్‌గా మలీహా ఇఫ్‌లను ప్రకటించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

**దుండిగల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక పరిధి, గండిమైసమ్మలోని ఎస్విఆర్ మోడల్ హైస్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్, ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సైన్స్ ఎగ్జిబిషన్ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలకు ప్రదర్శించి, అందుకు సంబంధించి వివరాలను తెలియజేస్తూ ఆహుతులను ఆకట్టుకున్నారు. కాగా మల్లారెడ్డి వైద్యశాల, మెడివిసన్, క్లవ్ డెంటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు తగిన మందులను అందించారు. శస్త్రచికిత్సలు అవసమైరనవారికి ఉచితంగా చేసుకునే వెసులు బాటు కల్పిస్తూ తగిన సూచనలు చేశారు. స్కూల్ చైర్మన్ డా.ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి వివిధ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్డిజాక్ ప్రెసిడెంట్ రాంరెడ్డి, యాదవ కమ్యూనిటి ప్రెసిడెంట్ రాంచందర్‌యాదవ్, మహిళ సంఘం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ బ్రహ్మేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దోమల నివారణ కోసం పటిష్టమైన చర్యలు

-కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి



మూసి పరివాహక ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** దోమల నివారణ కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ముసలంబాగ్ మూసి పరిహార ప్రాంతంలో సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పర్యటించి దోమల నివారణ కోసం పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చెత్తను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్ ను చెరువులో వేసి దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల దోమల ఉత్పత్తి పెరిగిందని, ప్రతిరోజు శానిటేషన్ స్ప్రే, ఫాగింగ్ చేయిస్తున్నామని వివరించారు. నివాసాలు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అపార్ట్మెంటులో ముఖ్యంగా ఇంకుడు గుంతలలో నీళ్లు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం టమాలజి సిబ్బంది సురేష్, వినయ్, దిలీప్ ,రా జు, నాగరాజు, సత్యనారాయణ, ప్రదీప్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులు నిత్యపరిశోధకులు:విజయరంగ



రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులు నిత్య పరిశోధకులని లయన్స్క్లబ్ హెల్త్ క్యాంప్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ పేర్కొన్నారు. సైన్స్ డే సందర్భంగా కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహీత సీవీ. రామన్ అఫెక్ట్ ఆవిష్కరణ చేసిన సందర్భంగా శుక్రవారం రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్రెడ్డి, సైన్స్ టీచర్ రమేష్రావు ఆధ్వర్యంలో సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా పేద మెరిట్ విద్యార్థులకు సహకారం అందించాలని సూచించారు.కార్యక్రమంలో లయన్ జితేందర్దేవి పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం



ఉప్పల శ్రీనివాస్గుప్తను సన్మానిస్తున్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** నాగోల్ బండ్లగూడలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి రేణుక ఎల్లమ్మతల్లి కళ్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణమహోత్సవానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్గుప్త హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపకను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల ఆగమలయ్యాయాదవ్, చింతల కిరణ్కుమార్యాదవ్, ఐలయ్యకురుమ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలి

: తహసిల్దార్ వీరాబాయి




సమావేశంలో ప్రసంగిస్తున్న అంబర్ పేట మండలం తహసిల్దార్ వీరబాయి, చిత్రంలో బాబు శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని అంబర్ పేట మండలం తహసిల్దార్ వీరబాయి పేర్కొన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఓల్డ్ మలక్ పేట లోని బిఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, పౌరులు తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీనివాస్, డిప్యూటీ తాహసిల్దార్ బలరాం, హైదరాబాద్ దళిత సేవా సంఘం అధ్యక్షులు బాబు శ్రీనివాస్, నాయకులు ఎం. రాజ్ కుమార్, చౌకి కుమార్, గౌస్, రాజేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్గుప్తా దంపతుల 50వ వివాహ మహోత్సవం సందర్భంగా తిరుపతిలో కుటుంబ సమేతంగా దర్శనం చేసుకుని వస్తున్న దృశ్యం.(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మధుయాష్కీ గౌడ్



**వనస్థలిపురం ఫిబ్రవరి.28.ప్రభాతవార్త.** పార్కులలో వాకర్స్ కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ పేర్కొన్నారు. వనస్థలిపురం, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్లోని వివేకానంద పార్క్, అభ్యుదయ నగర్ కాలనీ పార్క్, పోలీస్ స్టేషన్ వెనుక పార్కులను కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి మధుయాష్కి శుక్రవారం సందర్శించారు. ఎన్నికల ప్రచారాల సందర్భంగా మార్నింగ్ వాకర్స్ తో మాట్లాడిన ఆయన సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మధుయాష్కి స్వయంగా వచ్చి.. ఆయా పార్కులలో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వివేకానంద పార్కులో మూత్రశాలలు సరిగా లేవు అని, నూతనంగా నిర్మించిన వాటిని వినియోగించడం లేదని వివరించారు. సరిపడ నీరు లేకపోవడంతో మొక్కలకు నీరు పోయలేని పరిస్థితి ఉందన్నారు. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక పార్కులో నీళ్లు నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య , ఏ ఎం హెచ్ వో నీలిమ తో మాట్లాడారు. వెంటనే నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని మధు యాష్కీ సూచించారు. వాకింగ్ ట్రాక్ కు మరమ్మతులు చేయాలని సూచించారు. వర్షం నీరు బయటకు వెళ్లేలా, మొక్కలకు నీటి కోసం బోర్ రిపేర్ చేయించి సమస్య తీర్చాలని అధికారులకు సూచించారు. గెలుపోవటములతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమై.. వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మధు యాష్కీ పేర్కొన్నారు. కాలనీవాసులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తీసుకోండి: పోలీసులకు మధుయాష్కి గౌడ్ సూచవనస్థలిపురం ఫేస్2 కాలనీలోని బిఆర్కే పార్క్ స్థలాన్ని మధుయాష్కి గౌడ్ సందర్శించారు. సదరు పార్కు గ్రౌండ్లో ఆకతాయిలు రోజూ వచ్చి మద్యం సేవిస్తూ తమను ఇబ్బందుల గురి చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని, బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మధుయాష్కీ వనస్థలిపురం ఇన్స్పెక్టర్ శ్రీనివాసును పిలిపించి కాలనీవాసుల ముందే.. వారు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. అంతేకాకుండా ఆయనే స్వయంగా పేపర్ పై ఫిర్యాదును రాసి ఇచ్చారు. ఇకనుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ కాలనీవాసులకు ఇబ్బందులు కలిగించే ఆకతాయిలను ఉపేక్షించేది లేదన్నారు. అలా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కాలనీ మహిళలందరూ నిశ్చింతగా ఉండాలని, ఇక ఎవరు మీ జోలికి రారని భరోసా ఇచ్చారు. ఈ విషయంపై వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి గారితోనూ మాట్లాడారు. సదరు పార్కు గ్రౌండ్ లో పార్కు నిర్మాణానికి నిధులు మంజూరైనా కొందరు అడ్డుకుంటున్నారని తెలిసిందని, ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ పార్క్ నిర్మాణ పనులు ఆగవని సూచించారు. ఆ పనులు కొనసాగించి త్వరలో పూర్తి చేయిస్తామన్నారు.

# పారిశుధ్య లోపంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



వివేకానంద పార్క్ ముందు ధర్నా చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం ఫిబ్రవరి.28.ప్రభాతవార్త** బియన్ రెడ్డి నగర్ డివిజన్ కాలనీలో విబివీఖ్బి కాలనీలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి ,బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎక్కడి చెత్తకుప్పలు అక్కడ పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారిన పలుమార్లు చెప్పిన జిహెచ్ఎంసి పారిశుధ్య అధికారులు పట్టించుకోవడంలేదని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ఎక్కడ చెత్తకుప్పలు అక్కడే పేరుకు పోతున్నాయని పలుమార్లు కాలనీవాసులు పారిశుధ్య అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎందుకు పట్టించుకోవడంలేదని శానిటేషన్ దీని నీలిమ గారిని ప్రశ్నించడం జరిగింది. శానిటేషన్ ఎస్ఎస్, జవాన్, శీనీతి లు విధి నిర్వహణ సక్రమంగా చెయ్యకపోవడం వల్లనే పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని అన్నారు మరియు ప్రతిరోజు క్రమం తప్పకుండా ప్రతి కాలనీలో రోడ్లు శుభ్రపరచాలని, ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించాలని, పారిశుధ్య అధికారులు మరియు సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే సహించేది లేదని కార్పొరేటర్ గారు ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత, శ్రీధర్ రావు, విష్ణువర్ధన్ రెడ్డి,శరత్ కుమార్, మహేష్ గౌడ్, పవన్ రెడ్డి, ప్రభాకర్ ,మురళి, విజయ్,కిషోర్, గౌరీ శంకర్,సురేష్ కుమార్, ప్రేమ్ కుమార్, ప్రేమ్,భాను, మరియు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సత్కారం



**నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్ ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** రాచకొండ పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ రాములు, ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరేందర్, నాగోల్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై నారాయణరెడ్డి, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జాఫర్ అలీ లకు సీపీ శ్రీ సుధీర్ బాబు రాచకొండ కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, సుఖదుఃఖాలతో కలగలిపి ఉంటుందని, విధి నిర్వహణలో అన్నిటినీ సమానంగా స్వీకరించి ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమములో డీసీపీ అడ్మిన్ ఇందిర, అదనపు డీసీపీ అడ్మిన్ శివ కుమార్, ఎసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, సీసీఆర్బి ఎసిపి రమేష్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ సుగుణ, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పుష్పరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు మెరుగు

: ఇండియన్ మిసైల్ సైంటిస్ట్ ప్రహ్లాద రామారావు

**సరూర్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధితోనే దేశంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని ఇండియన్ మిసైల్ సైంటిస్ట్, కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ డిఆర్డిఓ మాజీ చీఫ్ కంట్రోలర్, డిఆర్డిఎల్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ప్రహ్లాద రామారావు అన్నారు. హైదరాబాద్ నగర శివార్లలోని నాదర్గుల్లోనున్న ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి, సైన్ అభివృద్ధితోనే భావి తరాలకు ఉపాధిలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పరిశోధనల ద్వారా వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో యువత అందుకు సంబంధించిన రంగాల్లో నైపుణ్యాలను నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పివిఆర్ కశ్యప్ మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనించాలని ఆయన అన్నారు. ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో అకాడమిక్స్తో పాటు శాస్త్ర, సాంకేతిక విద్యా రంగంలో మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నామనీ ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోనే కాలేజీ అగ్ర స్థానంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాలేజీ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ప్రొఫెసర్ ఎఆర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయా గుంటూరు, సీనియర్ డీన్ ప్రొఫెసర్ వర్ధని చుందూరు, డీన్లు ప్రొఫెసర్ వేణుగోపాల్రావు, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్తో పాటు హెచ్ఓడిలు, ప్రొఫెసర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలి



కార్పొరేటర్తో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

**హయత్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వేసవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి, హయత్నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్రెడ్డి సూచించారు. హయత్నగర్ డివిజన్ పరిధి శారదానగర్లో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడం వల్ల ఎండిపోయిన చెట్లు, ఎండు గడ్డికి అంటుకుని మంటలు పెద్దవిగా మారాయి. సమాచారం అందుకున్న హయత్నగర్ అగ్నిమాపక కేంద్ర సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్, ఎమ్మెల్యేలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేసవి నేపథ్యంలో చిన్నపాటి నిప్పుతో పెద్ద అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు అ ప్రమత్తంగా ఉంటూ చెత్త చెదారాలను కాల్చివేయరాదని సూచించారు. ముఖ్యంగా ఇళ్లల్లో నాణ్యమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించడం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించాలన్నారు. సకాలంలో స్పందించి మంటలను ఆర్పిన అగ్నిమాపక కేంద్ర సిబ్బందిని వారు అభినందించారు.

## టిపిసిసి విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పారిజాత

**సరూర్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** నగరంలోని గాంధీభవన్లో శుక్రవారం కొత్తగా వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన టిపిసిసి విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్కుమార్గౌడ్లతో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్న ఈ సమావేశానికి ఆమె హాజరయ్యారు.

## కల్వకుంట్ల కవితను కలిసిన మీర్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ నేతలు

**సరూర్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్రెడ్డి ఆధ్వర్యంలోని నాయకుల బృందం కలిసింది. కవిత నివాసానికి తరలివెళ్ళిన ఆయన అక్కడ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసారు. అదే విధంగా మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ను కూడా ఆయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణ, అవినాశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్డే వేడుకలు

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, రంగోలీ పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాలలో విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.విజయ్కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానం పట్ల మరింత చైతన్యవంతులను చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోపడుతాయని తెలిపారు. పోటీ పరీక్షలతో విద్యార్థుల భవిష్యత్ మరింత ఉన్నతంగా రాణించేందుకు వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.కె.విజయ్కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.రవిప్రసాద్, భౌతిక శాస్త్ర విభాగం అధిపతి డా.శ్రీనివాస్రావు, గీత, డా.యమున, డా.రాజశ్రీ, డా.తిరుపతయ్య, సత్యనారాయణ, విజయ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది : భగవాన్



అన్నదానం చేస్తున్న కమిటీ చైర్మన్ భగవాన్

**సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా భగవాన్ ఆధ్వర్యంలో చంపాపేటలోని శ్రీ నల్ల పోచమ్మ ఎర్రపోచమ్మ దేవాలయం సమీపంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 22 నెలలుగా శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యనాడు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బి నగర్ బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్, ఘనసాల వెంకటేష్, ఆడెల్ల రాజు, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, షానవాజ్ హుస్సేన్,ఘనసాల మురళీధర్ పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం



స్వామివారికి కల్యాణ వస్త్రాలను సమర్పిస్తున్న మాజీ కౌన్సిలర్ రమేష్గౌడ్ దంపతులు

**కుషాయిగూడ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ శివ కైంకర్యం పొందాలని కాప్రాజి కౌన్సిలర్ కమిటీ సభ్యులు ఎర్ర రమేష్ గౌడ్ పేర్కొన్నారు. మహాశివ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాప్రాసర్కిల్ పరిధిలోని కాప్రా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మహా శివునికి అభిషేకాలతో పాటు లింగోద్భవకాలంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణానికి గత అనేక సంవత్సరాలుగా అనాదిగా వస్తున్న వంశ ఆచారం ప్రకారం రమేష్ గౌడ్ దంపతులు స్వామివారికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో కృష్ణమాచార్యులు, సిబ్బంది శ్రీనివాస్ ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్ గౌడ్, కుమార్, ఆలయ అర్చకులు రవి శర్మ, కిరణ్ దీక్షితులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులస్తుల సంక్షేమానికి కృషి : పోల్కం శ్రీనివాస్




మలక్ పేట లో కేక్ కట్ చేసి టైలర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:** మేరు కులస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. మేరు యువజన సంఘం ఆధ్వర్యంలో మలక్ పేటలో టైలర్స్ డేని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ప్రకటించడం జరిగిందని, ఇప్పటివరకు చైర్మన్ ను నియమించలేదని పేర్కొన్నారు. చైర్మన్ గా తనకు అవకాశం కల్పించాలని కోరారు. మేరు కులస్తులకు ఆర్థికంగా, రాజకీయపరంగా చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు . మేరు కులస్తుల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్ ,వెన్ను శివకుమార్, చౌకి రవికుమార్, కొమరెల్లి రాజశేఖర్ రెడ్డి, సురేష్, పగిళ్ల నర్సింగ్, శ్రీనివాస్, పోల్కం వినాయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటి నేతలు

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎన్జీఆర్ఐ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బిక్కుమళ్ల అంజయ్యగుప్త, ఈగ అంజయ్య, తుమ్మల దేవిరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, అమరేశ్వరి, గరిక రాజేశ్వరి, బూసం రఘునాథ్రెడ్డి, వర్కల మధన్గౌడ్, ఎడ్ల అంజయ్య, ధర్మేంద్ర నాయక్, ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకన్న, పౌండర్ ట్రస్టీలు కట్టా నాగయ్య, లక్ష్మీనారాయణ, నరసింహులు, అంజయ్య, దేవాలయ అర్చరకులు రవీంద్రశర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు ఆలయంలో ఇక నుంచి అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ లెక్కింపు

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఉప్పల్ వెలుగుగుట్ట శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ లెక్కింపు శుక్రవారం చేపట్టారు. దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ డి.రవికుమార్, కార్యనిర్వహణ అధికారి రమాదేవి, ట్రస్టీ గొరిగె మల్లేష్, సభ్యులు ఆర్.శ్రీకాంత్రెడ్డి, జి.విజయ్కుమార్, క్లర్క్ చంద్రశేఖర్, ఆలయ పూజారి కొండూరి రమేష్ పంతులు, ఫణికుమార్, పవన్గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గత రెండు నెలల నుంచి రూ.73517 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రమాదేవి తెలిపారు. రెండు నెలలకు కలిపి రూ.73వేలు వచ్చిందని, ఆలయ అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.




శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటి నేతలు, ఇతర సిబ్బంది

## విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి:సతీష్




ప్రదర్శన తిలకిస్తున్న సతీష్, ఉమా

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు నూతన పరిశోధనలు చేయడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని శ్రీచైతన్య స్కూల్ దిల్సుక్నగర్ జోన్ ఏజీఎం సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా పేర్కొన్నారు. దిల్సుక్ నగర్ శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం శాస్త్రవేత్త సివి.రామన్ ఫిజిక్స్లో ఎఫెక్ట్ ఆవిష్కరణ చేసి నోబుల్ సాధించిన సందర్భంగా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుంటూ అధ్యయనం చేస్తూ నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సోలార్ పవర్, విద్యుత్ ఉత్పాదన, గృహ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఎరువుల అధిక దిగుబడులు తదితర అంశాలకు సంబంధించి చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలు పరిశోధనలపై ఉత్తమ ప్రతిభ కనబరిచిన కృష్ణకార్తీక్, అభిషేక్, శవనాజ్అలీ, హర్షిని, సాక్షిత్ విద్యార్థులను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాహుల్రెడ్డి, నాసా ఇన్చార్జి అనిత, నవీన్, పద్మజ, జరీన, శ్రీను, జితేందర్, వెంకట్రెడ్డి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



వినతిప త్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**హయత్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో కొనసాగుతున్న ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి ఎంక్యానాయక్కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని నారాయణ, శ్రీచైతన్య, శ్రీవశిష్ట, క్షేత్ర, యువ కాలేజ్లాంటి కార్పొరేట్ కళాశాలలు రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యామండలి నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లను చేపడుతున్నారని ఆరోపించారు. పదోతరగతి పరీక్షలు పూర్తికాకముందే విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువచ్చి అడ్మిషన్ల కోసం బలవంతం చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను అరికట్టాలని నిబంధనలను ఉల్లంఘిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ శ్రావణి, ఉపాధ్యక్షులు అరుణ్కుమార్, సహాయ కార్యదర్శి చింతవెంకటేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వి.శివ పాల్గొన్నారు.

## మూగజీవుల కోసం నీటివసతిని ఏర్పాటు చేయాలి



టబ్బులో నీటిని పోస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి

**హయత్నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వేసవి నేపథ్యంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఇంటిబయట నీటి వసతి ఏర్పాటు చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీలో వెంటర్నరీ సిబ్బందితో కలిసి మూగజీవుల కోసం నీటిఏర్పాటుపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నీటిని ఆదా చేయడం కోసం ఇంటి వాకిళ్లను పైప్తో కాకుండా బకెట్ను ఉపయోగించి శుభ్రపరుచుకోవాలని తద్వారా నీటిని ఆదాచేయాలని సూచించారు. అదేవిదంగా పక్షులు, ఇతర మూగజీవుల కోసం ఇంటి బయట బక్కెట్లు, టబ్బులలో నీటిని ఏర్పాటుచేయాలన్నారు.

## కాల బైరవ ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు



ఉప్పల్ కాల బైరవ ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్లోని శ్రీ కాల బైరవ ఆలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రతి నెల ఆలయంలో పూజలు నిర్వహిస్తారని, అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కాల భైరవ ఆలయం అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆలయంలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు కంచెమీది శివయ్య, ఎస్.వినోద్రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్రావు, అన్య బాలకృష్ణ, పిల్లి నాగరాజు, జెట్ట కిషోర్, నిరంజన్చారి, మేడిపల్లి నిరంజన్చారి, కడిగె శేఖర్,నవీన్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.